క్లుప్తంగా

కో ఆపరేటివ్ త్రిఫ్ట్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటరావు



వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వెంకటరావును అభినందిస్తున్న షిప్‌యార్డ్ అధికారులు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ వర్కర్స్ కో ఆపరేటివ్ అండ్ త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ప్యానెల్‌లో గెలుపొందిన 9 మంది డైరెక్టర్లలో ఒకరైన ఎస్.వెంకటరావును సొసైటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

100 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని సందర్శించిన జియ్యాని విజయ్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు గణేష్‌నగర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో రోటరీ నేత్ర వైద్య శాల సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు చేశారు. 25 మందికి శస్త్ర చికిత్స చేసుకోవాలని వైద్యులు సూచించారు. జియ్యాని విజయ్ కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు వర్మ బాబు, క్యాంపు కోఆర్డినేటర్ అప్పారావు, ఏఎన్ఎం సత్యవతి, ఆశ వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీరామ పాదుకల ఊరేగింపు



శ్రీరామ పాదాలను ఊరేగిస్తున్న ఎమ్మెల్యే

గోపాలపట్నం: శ్రీరామపాదుకలను ఎమ్మెల్యే గణబాబు ఊరేగించారు. అయోధ్య రామాలయం నిర్మాణంలో భాగంగా శ్రీరాముడి పాదుకలు దేశంలో తిప్పుతున్న నేపథ్యంలో మంగళవారం గోపాలపట్నం తీసుకు వచ్చారు. వాటిని గోపాలపట్నం నుంచి ప్రశాంతినగర్ పైడితల్లి అమ్మవారి ఆలయం వరకు ఊరేగించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే..

- వలంటీర్ల డిమాండ్
- అనుచిత వ్యాఖ్యలపై ప్రజలు సైతం మండిపాటు

సింథియా/గోపాలపట్నం: రాష్ట్రాన్ని దేశంలో మోడల్‌గా నిలిపింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ. అలాంటి వలంటీర్లపై అటు టీడీపీ అధినేత చంద్రబాబు, ఇటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరుపారేసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. తన సినిమాల్లో మహిళల పట్ల సభ్యత, సంస్కారం ఉన్నట్టు నటించడమే తప్పా నిజజీవితంలో మహిళలను గౌరవిస్తున్న దాఖలాలు లేవని వలంటీర్లు, ప్రజలు మండిపడుతున్నారు. అందుకే వలంటీర్లలో దాదాపు 70 శాతం మంది మహిళలే ఉన్నప్పటికీ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చంద్రబాబు, పవన్ మాట్లాడుతున్నారంటూ వలంటీర్లు నిప్పులు చెరుగుతున్నారు.

కోవిడ్ దెబ్బకు ప్రజలు వణికిపోతున్న సమయంలో వలంటీర్లు చేసిన సేవలు నిరుపమానం. మృతుల కడసారి చూపులకు సైతం బంధమిత్రులు రాని సమయంలో అన్నీ వలంటీర్లే అయి అంత్యక్రియలు చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. అలాంటి వలంటీర్లను కూలీలు, గోనె సంచులు మోసేవాళ్లు అంటు హేళనగా మాట్లాడిన చంద్రబాబునాయు ఆ తర్వాత బుద్ధి తెచ్చుకుని టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామన్నారు. పవన్ హైదరాబాద్‌లో కాపురం ఉంటూ వలంటీర్ల సేవలను గుర్తించకుండా నోటికొచ్చినట్టు మాట్లాడడంపై వలంటీర్లతో పాటు సేవలు పొందుతున్న ప్రజలు సైతం మండిపడుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సురేష్ (ఫైల్)



గర్భిణికి పౌష్టికాహారం అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్నాం



మేము చేస్తున్న పనిని ఉద్యోగంలా కాకుండా సేవలా భావించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నాం. మంచాన ఉన్న వారిని సైతం ఆప్యాయంగా పలకరిస్తూ నిస్వార్థంగా పనిచేస్తున్నాం. అటువంటి వలంటీర్లను పవన్‌కల్యాణ్ కించపరిచేలా మాటలు అనడం సరికాదు. వెంటనే తన మాటలు వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– నక్కా శిరీష, వలంటీర్, త్రినాథపురం, 62వ వార్డు

సేవా దృక్పథంతో పనిచేస్తున్నాం..



సేవా దృక్పథంతో వలంటీర్‌గా పని చేస్తున్నాం. వలంటీర్‌గా చేరిన తర్వాత మా వీధిలో మాకు విలువ పెరిగింది. నా క్లస్టర్ పరిధిలో చేసిన సేవకు తగిన గుర్తింపు లభిస్తోంది. మావల్ల ప్రజలకు నష్టం కలిగితే ఆ గౌరవం దక్కుతుందా..

– కొమ్మోజు భాగ్యలక్ష్మి, వలంటీర్

సంతృప్తికరంగా ఉంది..



వలంటీర్‌గా పని చేయడం సంతృప్తికరంగా ఉంది. ఇదొక అదృష్టంగా భావిస్తున్నాం. మాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ మాకు క్షమాపణ చెప్పాల్సిందే.

– లీలావతి, వలంటీర్

వలంటీర్ల వ్యవస్థ బాగుంది..



వలంటీర్ల వ్యవస్థ చాలా బాగుంది. వారు మా సమాచారం ఎవరికీ ఇవ్వడంలేదు. ప్రభుత్వ పథకాలకు అవసరమైన సమాచారం మాత్రమే తీసుకుంటున్నారు. వారిపై ఆరోపణలు దారుణం

– సన్యాసమ్మ, గోపాలపట్నం

వారి సేవలు మరువలేనివి..



వలంటీర్లు చేస్తున్న సేవలు మరువలేనివి. కోవిడ్ సమయంలో ఇల్లు కదల్లేని పరిస్థితిలో వారు ఇంటింటికీ వచ్చి మాకు సేవలు చేశారు. అలా సేవలు పొందిన వారు ఎవరూ వలంటీర్లను మర్చిపోలేరు.

– హేమలత, దుర్గాపురం

అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

- వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేస్తున్నారు
- విజ్ఞతతో మాట్లాడాలి
- జగనన్న సురక్ష ద్వారా ఇంటికే సర్టిఫికెట్లు అందిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



జగనన్న సురక్షలో ధ్రువపత్రం అందిస్తున్న ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు పరిధి గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో, కంపరపాలెం సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. జగనన్న సురక్షలో 11 రకాల సేవా కార్యక్రమాలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 92వ వార్డులో సుమారు రూ.11 కోట్ల వరకు అభివృద్ధికి వెచ్చించామని తెలిపారు. పలువురికి ధ్రువపత్రాలు అందించారు. ఏపీడీ శ్రీరామ్ మాట్లాడుతూ వార్డు పరిధిలో మొత్తం 2800 మందికి ధ్రువపత్రాలు అందించామని చెప్పారు. సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడికల్ కౌంటర్‌ను పరిశీలించారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు, గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయ, 91వ వార్డు అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసరావు, మురళీకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏఈపీ జయరామ్, వీఆర్‌వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సులువుగా సర్టిఫికెట్ వచ్చింది



వలంటీర్ మా ఇంటికి వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించింది. మీకు అవసరమైన ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాం. అవసరమైన పత్రాలు వలంటీర్‌కి అందించాం. మూడు రోజుల్లో ధ్రువపత్రం వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాం.

– పద్మకుమారి, గోపాలపట్నం

మూడు రోజుల్లోనే జనన ధ్రువపత్రం



మూడు రోజుల్లోనే జనన ధ్రువపత్రం వచ్చింది. ఇది నాకు ఆశ్చర్యంగా ఉంది. సాధారణంగా జనన ధ్రువపత్రం కావాలంటే చాలా కష్టపడాలి. అవేమీ లేకుండా బర్త్ సర్టిఫికెట్ అందుకున్నాను. జగనన్న మంచి కార్యక్రమం పెట్టారు. ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది.

– కంపర అప్పారావు, కంపరపాలెం

మళ్లీ జగనే సీఎం కావాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్



జయప్రకాశ్‌నగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ప్రజలకు మేలు చేయడంతో పాటు అభివృద్ధికి కట్టుబడి ఉన్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాశ్‌నగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే ముఖ్యమంత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెట్టి మీ వద్దకు పంపారని తెలిపారు. ప్రజల క్షేమం కోసం పరితపించే సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా అంతా నిలవా లని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే కరోనా కష్టకాలంలో కనిపించకుండా పోయారన్నారు. అలాంటి నాయకుడిని పక్కన పెట్టాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

బాజీ జంక్షన్‌లో రోడ్డు, డ్రైనేజీ పనులకు ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు.జీవీఎంసీ నిధులు రూ.12 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, పైడిరాజురెడ్డి, సత్యనారాయణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల నిరసన



షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద నిరసన తెలుపుతున్న లీడ్ ఇంజినీరింగ్‌లో పనిచేస్తున్న కార్మికులు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ మెయిన్ గేటు వద్ద లీడ్ ఇంజినీరింగ్ కంపెనీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 80 మంది కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఏడాది నుంచి కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా మోసం చేస్తున్నారని వాపోయారు. వెంటనే కార్మికుల జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గంగవరం పోర్టు కార్మికుల భిక్షాటన



పెదగంట్యాడ జంక్షన్‌లో భిక్షాటన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు నిర్మాణం జరిగితే గంగవరం, దిబ్బపాలెంలోని మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు వస్తాయని అనుకున్నామని, కానీ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులను ఇలా బిచ్చగాళ్లను చేస్తుందని అనుకోలేదని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు అన్నారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా కార్మికులంతా కలిసి పాత గాజువాక జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పాత గాజువాక జంక్షన్ నుంచి పెదగంట్యాడ వరకూ భిక్షాటన చేశారు.

సంపూర్ణ గృహ హక్కు కల్పించాలని వినతి



వెస్ట్ ఇన్‌చార్జి ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న కంపరపాలెం వాసులు

గోపాలపట్నం: తమ ప్రాంత వాసులకు సంపూర్ణ గృహ హక్కు కల్పించాలని కంపర పాలెం వాసులు వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఇక్కడి సమస్యను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆయనకు వివరించారు. కంపరపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇక్కడికి వచ్చిన గ్రామస్తులు ఆనంద్‌కుమార్‌కు విన్నవించారు. మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం సమయంలో అక్కడ నివాసముంటున్న వారిని ఇక్కడి వెంకటాపురం గ్రామం పరిధిలో 70, 71, 73 సర్వే నంబర్‌లో పట్టాలు అందించారని తెలిపారు. 1985లో గృహనిర్మాణ సంస్థ వద్ద రుణాలు పొంది వందశాతం రుణాలు తీర్చామని చెప్పారు. అయితే ఇంతవరకు నివాసముంటున్న గృహాలపై హక్కులు లేని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. దీంతో కుటుంబ అవసరాలకు, లోన్లు పెట్టుకోవడానికి, అమ్మకానికి ఈ గృహాలు ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇది సింహాచలం దేవస్థానం భూముల్లో ఉందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు చెబుతున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తనకు కొద్ది రోజులు సమయం కావాలని ఈ సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఆయా శాఖల నుంచి సమాచారం తీసుకుని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

చింతల్లోవలో కంటి పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో సుమారు 80 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీపై కార్మికులకు అపార విశ్వాసం

ఉక్కునగరం: కార్మికులకు ఐఎన్‌టీయూసీపై అపార విశ్వాసం ఉందని, ఇందుకు నిదర్శనం షిప్‌యార్డ్ కోపరేటివ్ ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు ఐఎన్‌టీయూసీ గెలుచుకోవడమేనని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాజు అన్నారు. మంగళవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన ఆయన ఐఎన్‌టీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని సంస్థల్లోని కార్మికుల ప్రయోజనాల కోసం తాము పనిచేస్తున్నామన్నారు. షిప్‌యార్డ్, స్టీల్‌ప్లాంట్‌లలో కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు సాధనకు ఎనలేని కృషి చేస్తున్నామని చెప్పారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి రాజు

కార్యక్రమంలో నాయకులు కారు రమణ, అవతారం, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ. నాయుడు, డి. మోహన్, మొల్లి ఈశ్వరరావు, గంగవరం గోపి పాల్గొన్నారు.

మినిస్టీరియల్ స్టాఫ్ సేవలు వెలకట్టలేనివి

మహారాణిపేట : మినిస్టీరియల్ విభాగం ఆస్పత్రి పరిపాలనకు గుండెకాయ వంటిదని, ఈ విభాగం శక్తివంతంగా ఉంటేనే ఆస్పత్రిలో అన్ని విభాగాలు సమర్థవంతంగా పని చేస్తాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. మంగళవారం కేజీహెచ్ ఆవరణలో బదిలీపై వెళ్లిన ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా పాటించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరు నిరంతరం కష్టపడి పని చేయాలన్నారు. సర్వీసులో ఉద్యోగులకు బదిలీలు సాధారణం అని కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది తెర వెనుక ఉన్న హీరోలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ జోగిరాజు, మేనేజర్ ఎస్ఎస్‌శర్మ, అకౌంటెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను సన్మానించారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి పటిష్టమైన కార్మికోద్యమ నిర్మాణం కీలకమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు అన్నారు. ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో రెండు రోజుల యువ కార్యకర్తల శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశంలోని కార్మికవర్గం తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుందన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపకపోతే దేశంలో ప్రజలకు కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా ఉండే పరిస్థితి లేదన్నారు. ఆగస్టు 9వ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రొఫెసర్ అంజయ్య, ప్రొఫెసర్ బి. జమిందార్, ఎం. వెంకటయ్య, రాష్ట్ర ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య తదితరులు ప్రసంగించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం



శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టువదలక ఉక్కు పరిశ్రమ కోసం నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రశ్నించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 880వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని డిమాండ్ చేశారు. ఉక్కు పోరాటం మొదలుపెట్టి 880 రోజులు గడుస్తున్న కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఇంత చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

23న ప్రజా సింహగర్జన

డాబాగార్డెన్స్ : బీసీలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరుగుతుందని బీసీ జాతీయ నేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం అనకాపల్లి జిల్లా భారతీయ యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు నిర్వహించిన నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనార్టీ, వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. గుంటూరు..విజయవాడ జాతీయ రహదారి నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ప్రజా చైతన్య వేదికకు పెద్ద ఎత్తున ఆయా వర్గాల ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రయాదవ్ తదితరులు

స్టీల్‌ప్లాంట్ పోలీసులకు బ్రహ్మకుమారీల సత్కారం



స్టీల్‌ప్లాంట్ సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

ఉక్కునగరం: ఓం శాంతి బ్రహ్మకుమారీలు మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులను సత్కరించారు. కోవిడ్ సమయంలో పోలీసులు చేసిన సేవలను గుర్తించి వారిని సత్కరించాలని బ్రహ్మకుమారీ ముఖ్య కేంద్రం మౌంట్ ఆబూ నుంచి వచ్చిన సూచనల మేరకు పెదగంట్యాడ వినాయక నగర్ వుడాకాలనీకు చెందిన బ్రహ్మకుమారీ కేంద్ర ఇన్‌చార్జ్ శాంతి నేతృత్వంలో సత్కరించారు. సీఐ వి. శ్రీనివాసరావు, ఎస్ఐలు వరలక్ష్మి, శ్రీకాంత్, సిబ్బందికు మౌంట్ అబూ నుంచి వచ్చిన శాలువాలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో సీఐ వి. శ్రీనివాసరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.